www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

విజయ దశమి శుభాకాంక్షలు

శనివారం | 12-10-2024 | పేజీలు: 8 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 21 సంచిక (Issue) : 285 | కడప సిటీ**

Kadapa | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం; తిథి: నవమి ఉ. 10.59 తదుపరి దశమి; నక్షత్రం: శ్రవణం తె. 4.25 తదుపరి ధనిష్ఠ; వర్జ్యం: ఉ. 9.15 -10.47; దుర్ముహూర్తం: ఉ. 6.11-7.44; అమృతఘడియలు: రా. 6.28-8.00; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.11; సూర్యాస్తమయం: 5.51

జిల్లా ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు



రాయచోటి(కలెక్టరేట్), అక్టోబరు11: దుర్గామాత మహిషాసురిని సంహరించి చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి పండుగ సందర్భంగా రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ జిల్లా ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు శుక్రవారం వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నవరాత్రుల్లో భాగంగా భక్తి స్వరూపిణి అయిన అమ్మవారిని 9 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజించి.. పదవ రోజు దశమితో విజయానికి సంకేతంగా దసరా పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవడం ఆనవాయితీ. ఈ పండుగను ప్రజలందరూ సుఖసంతోషాలతో చేసుకోవాలని వారు ఆకాంక్షించారు.

జయహో.. భవానీ



వీరభద్రాలయంలో భవానీదేవి అలంకరణ



ఒంటిమిట్టలో వాసవీమాతగా..



రైల్వేకోడూరులో కాళింగమర్ధిని అలంకారం

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పలు ఆలయాల్లో వివిధ రూపాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్ర ఆలయంలో భవానీదేవి అలంకారం, ఒంటిమిట్టలో వాసవీమాతగా, రైల్వేకోడూరు ఆర్యవైశ్య సమాజంలో కాళింగమర్ధిని అలంకారంలో అమ్మవారిని అలంకరించగా, భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మదనపల్లె వాసవీభవన్‌లో కన్యకాపరమేశ్వరికి రాజ రాజేశ్వరదేవి అలంకారం, గుర్రంకొండ మండలంలోని చెర్లోపల్లె రెడ్డెమ్మ మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. కాగా, రాజంపేట పట్టణంలోని అమ్మవారిశాలలో అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు. ఆర్యవైశ్యులు భక్తిశ్రద్ధలతో గుండంలో నడుచుకుంటూ వెళ్లి తమ మొక్కులను చెల్లించుకున్నారు.

- రాయచోటిటౌన్/రాజంపేట, మదనపల్లె



మదనపల్లె కన్యకాపరమేశ్వరీకి రాజరాజేశ్వరీ అలంకరణ




రాజంపేటలో అమ్మవారి గుండ ప్రవేశం చేస్తున్న భక్తులు

నీళ్లు ఫుల్.. సాగు నిల్..

కరువుకు నిలయమైన తంబళ్లపల్లెలో బీడు భూములను సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో నిర్మించిన చిన్నేరు, దబ్బలగుట్ట మినీ సాగునీటి ప్రాజెక్టులు అలంకారప్రాయంగా మారాయి. ప్రాజెక్టులు పూర్తై సుమారు 14 ఏళ్లు గడుస్తున్నా ఆయకట్టు పొలాల్లో చుక్క నీరు పారడం లేదు. ఏటా ప్రాజెక్టులు పూర్తి స్థాయిలో నిండుతున్నా కాలువలు అసంపూర్తిగా ఉండటంతో ఆయకట్టు భూములకు చుక్క నీరందని పరిస్థితి. ఇక ప్రాజెక్టు కాలువల కోసం భూములిచ్చిన రైతులకు ప్రతిఫలంగా దక్కాల్సిన నష్టపరిహారం ఇంతవరకు అందలేదు. దీంతో ఏళ్ల తరబడి పరిహారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా పట్టించుకునే వారే లేరు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనైనా న్యాయం జరుగుతుందని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.



నీటితో నిండు కుండను తలపిస్తున్న చిన్నేరు ప్రాజెక్టు



కంపచెట్లతో అడవిని తలపిస్తున్న దబ్బలగుట్ట ప్రాజెక్టు కట్ట



నీటితో తొణికిసలాడుతున్న దబ్బలగుట్ట ప్రాజెక్టు

- జలాశయాలు పూర్తైనా..అసంపూర్తిగా కాలువల నిర్మాణాలు
- కంపచెట్లతో నిండిపోయిన కాలువలు
- సాగుకు చుక్క నీరందని దుస్థితి
- ఏళ్లు గడుస్తున్నా.. భూములిచ్చిన రైతులకు అందని పరిహారం

తంబళ్లపల్లె, అక్టోబరు 11: తంబళ్లపల్లె మండలంలో దివంగత అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, దివంగత ఎమ్మెల్యే కలిచెర్ల ప్రభాకర్‌రెడ్డి హయాంలో చిన్నేరు, దబ్బలగుట్ట చిన్నతరహా సాగు నీటి ప్రాజెక్టులను నిర్మించారు. ఈ రెండు ప్రాజెక్టు పనులు 2005లో ప్రారంభించగా.. 2010లో పూర్తయ్యాయి. మండలంలోని పరుసతోపు పంచాయతీ దబ్బలగుట్టపల్లె సమీపంలో దబ్బలగుట్ట మినీ ప్రాజెక్టును రూ.2.75 కోట్ల వ్యయంతో 220 ఎంసీఎఫ్‌టీల నీటి సామర్థ్యంతో నిర్మించగా.. సుమారు వెయ్యి ఎకరాలకు నీరు అందించాలన్నది ఈ ప్రాజెక్టు లక్ష్యం. అదేవిధంగా పరుసతోపు పంచాయతీ చెన్నప్పగారిపల్లె సమీపంలో చిన్నేరు మినీ ప్రాజెక్టును రూ.7.60 కోట్ల వ్యయంతో 370 ఎంసీఎఫ్‌టీల సామర్థ్యంతో నిర్మించగా.. గుండ్లపల్లె, గోపిదిన్నె పంచాయతీ పరిధిలోని సుమారు వెయ్యి ఎకరాలకు పైగా నీరు అందించాలన్నది ఈ ప్రాజెక్టు లక్ష్యం. అయితే లక్ష్యం మేరకు ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేసినా.. కాలువలకు భూమి కోల్పోయిన రైతులకు పరిహారం అందకపోవడం, కాలువలు అసంపూర్తిగా మిగిలిపోవడంతో ఆయకట్టు పొలాలకు నీరందని పరిస్థితి ఏర్పడింది.

చిట్టడవిని తలపిస్తున్న ప్రాజెక్టు కట్టలు

చిన్నేరు, దబ్బలగుట్ట ప్రాజెక్టు కట్టలపై పెద్ద పెద్ద కంప చెట్లు పెరిగి చిట్టడవిని తలపిస్తోంది. ప్రాజెక్టులు పూర్తైనప్పటి నుంచి నిర్వహణ లేకపోవడం, అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో కట్ట మొదటి నుంచి చివరి వరకు కంపచెట్లు పెరిగి కనీసం నడవలేని పరిస్థితి నెలకొంది. చిన్నేరు ప్రాజెక్టు పూర్తైన మొదట్లో చూడటానికి వచ్చే సందర్శకులతో కిటకిటలాడుతుండేది. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి కుటుంబ సమేతంగా ప్రాజెక్టుకు వచ్చి ఉదయం నుంచి సాయంత్రం వరకు సేదతీరేవారు. ప్రస్తుతం ప్రాజెక్టు కట్ట మొత్తం కంపచెట్లతో నిండిపోవడంతో ఎవ్వరూ అటువైపు కన్నెత్తి చూడటం లేదు.

అసంపూర్తిగా కాలువల నిర్మాణాలు

చిన్నేరు, దబ్బలగుట్ట మినీ సాగు నీటి ప్రాజెక్టులకు ఏటా పూర్తి స్థాయిలో నీరు చేరుతున్నా.. తూముల వద్ద లీకేజీలు, తూముల గేట్లు సరిగ్గా పనిచేయకపోవడం, కాలువలు నిర్మాణాలు పూర్తి స్థాయిలో చేపట్టకపోవడం తదితర కారణాలతో ఆయకట్టుకు నీరందని పరిస్థితి. చిన్నేరు, దబ్బలగుట్ట ప్రాజెక్టుల కుడి, ఎడమ కాలువలు సుమారు రెండు కిలోమీటర్ల మేర తీశారు. అయితే కాలువల నిర్మాణాలు అసంపూర్తిగా చేపట్టడం, తవ్విన కాలువలకు లైనింగ్ పనులు చేపట్టకపోవడం తదితర కారణాలతో ప్రస్తుతం కాలువలు పూడిపోయి రూపు లేకుండా పోయాయి. గట్ల మీద, కాలువల్లో విపరీతంగా పిచ్చి మొక్కలు, కంపచెట్లు మొలచి చిట్టడవిని తలపిస్తున్నాయి.


భూములిచ్చిన రైతులకు అందని పరిహారం

చిన్నేరు, దబ్బలగుట్ట ప్రాజెక్టు కాలువల కోసం భూములు కోల్పోయిన రైతులకు ఇప్పటికీ నష్టపరిహారం అందలేదు. చిన్నేరు ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల కింద గుండ్లపల్లె పంచాయతీలోని వేపలపల్లె, దిగువపల్లె, మొరుసుపల్లెబురుజు, పాపిరెడ్డిగారిపల్లె, వేమారెడ్డిగారిపల్లె, సిద్దవాండ్లపల్లె, గుండ్లపల్లె తదితర గ్రామాలకు చెందిన సుమారు 70 మందికి పైగా రైతులు 50 ఎకరాలకు పైగా కాలువలకు భూములు కోల్పోయినట్లు చెబుతున్నారు. అలాగే దబ్బలగుట్ట ప్రాజెక్టు కాలువల కింద సుమారు 40 మందికి పైగా రైతులు భూములు కోల్పోయారు. బాధిత రైతులు పరిహారం కోసం కొన్నేళ్లుగా తంబళ్లపల్లె, మదనపల్లె, ఉమ్మడి చిత్తూరు జిల్లా కేంద్రంలోని కలెక్టరు కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా పరిహారం మంజూరు కాలేదు. దీంతో పలువురు రైతులు ఇక చేసేది లేక తమ భూముల గుండా వెళ్లిన కాలువలను పూడ్చి వేసి పంటలు సాగు చేసుకుంటున్నారు.

ముంపు బాధితులకు అందని ఇంటి స్థలం

చిన్నేరు ప్రాజెక్టు ముంపు బాధితులకు పరిహారం అందినా.. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజి కింద ఇవ్వాల్సిన ఇంటి స్థలం పూర్తి స్థాయిలో ఇవ్వలేదు. చిన్నేరు ముంపు గ్రామమైన చెన్నప్పగారిపల్లెలో సుమారు 66 కుటుంబాలు ఉండగా 33 కుటుంబాలకు మాత్రమే అప్పట్లో తంబళ్లపల్లెకు సమీపంలోని హైస్కూల్ ఎదురుగా ఒక్కొక్కరికీ 3 సెంట్ల చొప్పున స్థలం కేటాయించారు. వీరికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజి కింద ఒక్కో కుటుంబానికి 5 సెంట్ల స్థలం ఇవ్వాల్సి ఉండగా 3 సెంట్ల స్థలం మాత్రమే ఇచ్చారు. మిగిలిన వారికి ఇళ్లు నిర్మించుకోవడానికి స్థలం కానీ పరిహారం ఇస్తామన్న అప్పటి అధికారులు చెప్పిన మాటలు కేవలం మాటలుగానే మిగిలిపోయాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ప్రాజెక్టు భూ బాధితులకు నష్టపరిహారం అందించి, కాలువల నిర్మాణం పూర్తి చేస్తే వందల ఎకరాలు ఆయకట్టు సాగులోకి వచ్చి తంబళ్లపల్లె సస్యశ్యామలం అవుతుంది.

కాళ్లరిగేలా తిరిగాం..



చిన్నేరు ప్రాజెక్టు ఎడమ కాలువకు 30 కుంటలు భూమి పోయింది. అపుడు మార్కెట్ వాల్యూ, భూమి విలువ ప్రకారం కాలువలకు పరిహారం ఇస్తామన్నారు. ప్రాజెక్టు పూర్తయ్యి పద్నాలుగు సంవత్సరాలు పైన కావస్తోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అనేకసార్లు కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగి అర్జీలు ఇచ్చాము. ఇంత వరకు ఏ ఒక్క రైతుకు పరిహారం అందలేదు.

- చిన్నప్పరెడ్డి, వేమారెడ్డిగారిపల్లె

20 కుంటల భూమి పోయింది..



చిన్నేరు ప్రాజెక్టు కింద 20 కుంటలు భూమి కుడి కాలువకు పోయింది. పరిహారం కోసం అధికారులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ అనేక సార్లు తిరిగినా ఒక్క రుపాయి అందలేదు. మొదట్లో ఒకటి, రెండుసార్లు అధికారులు వచ్చి భూములిచ్చిన రైతుల వివరాలు తీసుకుని కాలువలు కొలుచుకుని పోయారు. అంతే మళ్లీ ఇటు వైపు తిరిగి చూడలేదు.

- శేఖర్‌రెడ్డి, దిగువపల్లె



కంపచెట్లు, పిచ్చిమొక్కలు మొలిచి రూపు కోల్పోయిన చిన్నేరు ప్రాజెక్టు కాలువ

ఆడపిల్లల్ని చదివిద్దాం.. భవిష్యత్తుకు బాటలు వేద్దాం

- కలెక్టర్ చామకూరి శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), అక్టోబరు 11: ఆడపిల్లల్ని చదివిద్దాం, భావితరాల ఉత్తమ భవిష్యత్తుకు పునాదులు వేద్దామని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని ఐసీడీఎస్, వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా సాధికారితను సాధించాలంటే అమ్మాయిలందరికీ చదువుకునే అవకాశం కల్పించాలన్నారు. సమాజంలో అమ్మాయిలు చదువుకుంటే భవిష్యత్తులో సమాజాన్ని పురోగతివైపు నడిపించడంలో కీలకపాత్ర పోషిస్తారన్నారు. అన్నమయ్య జిల్లాలో ప్రతి అమ్మాయి చదువు కునే విధంగా అధికారులు, సిబ్బంది కృషి చేయాలని సూచించారు. సమాజంలో ఆడపిల్లల పాత్ర గుర్తించేందుకు, ఆడపిల్లలను రక్షించేందుకు ప్రధానమంత్రి మోదీ బేటీ బచావో బేటీ పఢావో కార్యక్రమాన్ని తీసుకొచ్చారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. జిల్లాలో ఐసీడీఎస్ అధికారులు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, మహిళా సంరక్షణ కార్యదర్శులు కలిసికట్టుగా పనిచేసి అన్నమయ్య జిల్లాను బాల్యవివాహాలు లేని జిల్లాగా తీర్చిదిద్దాలని కోరారు. జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న స్కానింగ్ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లాలో బాల్యవివాహాలను నిలుపుదల చేయడంలో కృషి చేసిన అధికారులు, సిబ్బందిని అభినందించి మెమెంటోలను అందజేరు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారి రమాదేవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కొండయ్య, సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, మహిళా సంరక్షణ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపులకు దరఖాస్తుల వెల్లువ

- జిల్లాలో 111 షాపులకు 2116 దరఖాస్తులు
- ప్రభుత్వానికి రూ.42కోట్లు ఆదాయం
- పీలేరు నియోజకవర్గంలో తగ్గిన దరఖాస్తులు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొత్త మద్యం దుకాణాలకు దరఖాస్తులు వెల్లువెత్తాయి. జిల్లాలోని 111 మద్యం దుకాణాలకు శుక్రవారం రాత్రి ఏడు గంటల సమయానికి 2116 దరఖాస్తులు వచ్చాయి. దీని వల్ల ప్రభుత్వానికి రూ.42కోట్లకు పైగా ఆదాయం వచ్చింది. రాజంపేట నియోజకవర్గం వీరబల్లి మండలంలో ఉన్న ఒకే ఒక దుకాణానికి అత్యధికంగా 56 దరఖాస్తులు వచ్చాయి. పీలేరు నియోజకవర్గం కలికిరి మండలంలో మూడు దుకాణాలకు ఒక్కోదానికి 6 దరఖాస్తులు వచ్చాయి. గరిష్టంగా మదనపల్లె నియోజకవర్గంలో 649 దరఖాస్తులు వచ్చాయి. పీలేరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో దరఖాస్తులు చాలా తక్కువగా వచ్చాయి. దీని వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జిల్లాలో రాయచోటి, లక్కిరెడ్డిపల్లె, రాజంపేట, రైల్వేకోడూరు, మదనపల్లె, ములకలచెరువు, వాయల్పాడు, పీలేరు ఎక్సైజ్ పోలీసు స్టేషన్ల పరిధిలో 111 మద్యం దుకాణాలు ఉన్నాయి. ఈ స్టేషన్లలో వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తే.. రాయచోటి 422, లక్కిరెడ్డిపల్లె 150, రాజంపేట 253, రైల్వేకోడూరు 228, మదనపల్లె 649, ములకలచెరురు 200, వాయల్పాడు 78, పీలేరు 136 దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలోని ఆరు నియోజకవర్గాలలో గమనిస్తే.. రాయచోటి, తంబళ్ళపల్లె, మదనపల్లె నియోజకవర్గాలలో దరఖాస్తుల జోరు కనిపించింది. అదే సమయంలో పీలేరు, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలలో పెద్దగా జనం ఆసక్తి చూపలేదు. రాజంపేట, రైల్వేకోడూరులో ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లు లేకపోయినా.. ఎందుకనో.. ఎక్కువ మంది దరఖాస్తు చేసుకోలేదు. పీలేరు నియోజకవర్గంలో కలికిరి, వాయల్పాడు, పీలేరు, గుర్రంకొండ మండలాల్లో దరఖాస్తుల తగ్గడానికి అధికారపార్టీకి చెందిన ముఖ్యనాయకుల ఒత్తిడే కారణమనే ఆరోపణలు ఉన్నాయి. తమ వర్గీయులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, మిగిలిన ఎవరూ వేయకూడదని సదరు ముఖ్యనాయకులు హెచ్చరించినట్లు ప్రచారం. ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం ఈనెల 9లోపు దరఖాస్తు చేసుకోవాలి. అయితే పలుచోట్ల అధికారపార్టీ నాయకులు, ఎమ్మెల్యేల ఒత్తిడి కారణంగా దరఖాస్తులు ప్రభుత్వం ఆశించినంత స్థాయిలో రాలేదని, ఆ గడువును 11వరకు పెంచారు. దీంతో ఈ రెండు రోజుల్లో దరఖాస్తులు గణనీయంగా పెరిగాయి. ఈ దరఖాస్తులను ఈనెల 14న కలెక్టర్ ఆధ్వర్యంలో డ్రా తీయనున్నారు.



చిన్నమండెం: మహిషాసురమర్దినిగా కాళీమాత



చిట్వేలిలో భద్రకాళి..



పెనగలూరులో కామాక్షమ్మ..



రాయచోటిలో చౌడేశ్వరి..

జయజయహే.. మహిషాసురమర్దిని..

చిట్వేలి, అక్టోబరు 11 : శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం పాతచిట్వేలిలోని భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో అమ్మవారిని మహిషాసురమర్దినిగా అలంకారం చేశారు. శ్యామలాంబ సమేత సోమేశ్వరాలయం, శివాలయం, సత్యమ్మ ఆలయంలో అమ్మవార్లకు పూజలు చేశారు.

పెనగలూరు: పెనగలూరు నయనేశ్వరస్వామి ఆలయంలోని కామాక్షమ్మ శుక్రవారం మహిషాసురమర్దినిగా, వినాయక నగర్‌లో దుర్గామాత ఆదిశక్తిగా దర్శనమిచ్చారు.

సంబేపల్లె:సంబేపల్లె దేవరరాయి నల్లగంగమ్మ తల్లి ఊటు పాలెం అనంతపురం తల్లి మహిషాసురమర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. .

చిన్నమండెం: మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు గాయత్రిగా, దేవగుడిపల్లి కాళీమాత ఆలయంలో అమ్మవారు మహిషాసురమర్దినిగా అనుగ్రహించారు.

సుండుపల్లె: నల్లగుట్టపల్లిలో వెలసిన దుర్గమ్మకు శుక్రవారం అభిషేకం నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించి పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం హోమం చేశారు. మాలలు ధరించిన భక్తులు మాలలను తీసివేశారు.

రైల్వేకోడూరు: ఆర్యవైశ్య సమాజంలో కాళింగమర్దిని అలంకారం లో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

నందలూరు: మండలంలోని నాగిరెడ్డిపల్లెలో వాసవీ కన్యకాపరమేశ్వరి అన్నపూర్ణ అలంకారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆబాలగోపాలం అగ్నిగుండంలో నడిచి మొక్కులను తీర్చుకున్నారు.

లక్కిరెడ్డిపల్లె: సర్వమంగళాదేవి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరిగా దర్శనమిచ్చారు.

సుండుపల్లె: మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి ఆల యంలో అమ్మవారిని మీనాక్షిదేవి రూపంలో అలంకరించారు.

ఒంటిమిట్ట: స్థానిక అమ్మవారిశాలలో వాసవిహోమం, గణపతి హోమం, నవగ్రహ హోమాలు చేశారు. అమ్మవారిని వాసవీమాతగా అలంకరించారు.

రాయచోటిటౌన్: పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్ర ఆలయంలో అమ్మవారు భవానీదేవి అలంకారంలో, అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో దాక్షాయణి మహాలక్ష్మి అలంకారంలో, కొత్తపేట రామాపురంలో చౌడేశ్వరి మహిషాసుర మర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

రాజంపేట టౌన్, : అమ్మవారిశాలలో గుండ ప్రవేశం నిర్వహించారు. ఆర్యవైశ్యులు భక్తిశ్రద్ధలతో గుండంలో నడిచి మొక్కులను చెల్లించుకున్నారు.మన్నూరు ఉదయగిరి ఎల్లమ్మ ఆలయంలో లక్ష కుంకుమార్చన చేశారు.

యువతలో క్రీడా స్ఫూర్తి ఉండాలి

ఓబులవారిపల్లె, అక్టోబరు 11 : మండల పరిధిలోని మంగం పేట గ్రామ పంచాయతీ పరిధిలో మంగంపేట యూత్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్న వాలీ బాల్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే అరవ శ్రీధర్, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి ప్రారంభించా రు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థిరత్వాన్ని పెంపొందించడానికి దోహదం చేస్తాయని అన్నారు.ఈ పోటీల్లో 26 జట్లు పోటీ పడుతున్నాయి. టీటీపీ సీనియర్ నాయకులు కల్లా చలపతి, యువ నాయకులు ముక్కా సాయివికాస్‌రెడ్డి, విశాల్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, లావులూరు చరణ్, మంగంపేట సర్పంచ్ సుధాకర్, గ్రామ యూత్, ప్రజలు, ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి

14 నుంచి 'పల్లె పండుగ'

రైల్వేకోడూరు, అక్టోబరు 11: ఈ నెల 14 నుంచి 20 వరకు పల్లె పండుగ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రైల్వేకోడూరు మండల అభివృద్ధి అధికారి నాగార్జునరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 14న రైల్వేకోడూరు, ఓబనపల్లె, 15న వెంకటరెడ్డి`ఎల్లె, వీపీఆర్ కండ్రిక, 16న రాఘవరాజపురం, చియ్యవరం, 17న అనంతరాజుపేట, 18న బొజ్జావారిపల్లె, 19న మైసూరివారిపల్లె, 20న మాధవరంపోడు గ్రామ పంచాయతీలలో పల్లెపండుగ జరుగుతుందని ఆయన వివరించారు.

టీచర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లండి

రాయచోటిటౌన్, అక్టోబరు 11: అన్నమయ్య జిల్లాలోని వివిధ మండలాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు సంబంధించిన వివిధ సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏపీ జేఏసీ జనరల్ సెక్రటరీ కేఎస్ఎస్ ప్రసాద్‌కు యూటీఎఫ్ అన్నమయ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యర్శులు హరిప్రసాద్, జాబీర్ వినతిపత్రం అందజేశారు. కడపజిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం కడప జిల్లా కార్యలయానికి విచ్చేసిన ఏపీ జేఏసీ సెక్రటరీ జనరల్ కేఎస్ఎస్ ప్రసాద్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ జీవో నెంబర్ 51 ప్రకారం డీఏ అరియర్స్ బిల్లులను సీఎఫ్ఎంఎస్‌లో తయారీకి మరల అవకాశం కల్పించే విధంగా రాష్ట్ర ఆర్థికశాఖ, ఖజానాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అలాగే 2023-24 సంవత్సరాల్లో పదవ తరగతి పరీక్షలు నిర్వహించిన జవాబు పత్రాల మూల్యాంకనం చేసిన వారికి రెమ్యునరేషన్ జిల్లా విద్యాశాఖ అధికారులు నేటికీ చెల్లించలేదని వినతి పత్రంలో పేర్కొన్నారు. సమస్యలను విద్యాశాఖ కమిషనర్ దృష్టికి తీసుకె ళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ అన్నమయ్య జిల్లా కార్యదర్శి వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

మంగంపేట సమస్యలపై సీపీవోకు వినతి

ఓబులవారిపల్లె, అక్టోబరు 11 : సమస్యలను తీర్చాలంటూ మంగంపల్లి కార్మిక సంఘాల నాయకులు సీహెచ్ చంద్రశేఖర్, ఆర్.,వెంకటేశ్ సీపీవో గోపీనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగంపేట పరిధిలోని అయ్యపురెడ్డిపల్లెలో 2012లో నిర్వాసితులైన వారికి నేటికీ ఇంటి స్థలాలు ఇవ్వలేదన్నారు. ఈ విషయం ఏపీఎండీసీ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చేస్తామని సీపీవో తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

గాలివీడు, అక్టోబరు11: బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని అతేనా, ప్రేరణ సంస్థ రీజనల్ కోఆర్డినేటర్ సర్వలత తెలిపారు. వారు శుక్రవారం మండలంలోని తూముకుంట పంచాయతీలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని తెలియజేశారు. సమాజాభివృద్ధిలో వీరి యొక్క పాత్ర ఉండాలన్నారు. బాలికలు ఆరోగ్యానికి వ్యక్తిగత సంరక్షణకు ప్రాధాన్యతను ఇవ్వాలని తెలిపారు. అనంతరం బాలికలకు వివిధ అంశాల్లో క్రీడలను నిర్వహించి వారందరికీ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ మమత తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారిశాలలో సుగవాసి పూజలు

రాజంపేట, అక్టోబరు 11 : పట్టణంలోని అమ్మవారి శాలలో కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో శుక్రవారం రాజంపేట నియోజకవర్గ టీ డీపీ ఇన్‌చార్జి సుగవాసి బా ల సుబ్రమణ్యం పూజలు నిర్వహించారు. వేద పండి తులు అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేసి వేదమం త్రాలతో ఆశీర్వదించారు. అనంతరం దుశ్శాలువాతో సత్కరించారు. అనంతరం ఆర్య వైశ్య నాయకులను కలిసి సుగవాసి చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, దసరా ఉత్సవ కమిటీ సభ్యులు, టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

పారిశుధ్య సిబ్బందికి దుస్తులు పంపిణీ

చిట్వేలి, అక్టోబరు 11 : దసరా పండుగను పురస్కరించుకుని చిట్వేలి గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు ఉపసర్పంచ్ ఉమామహేశ్వర్‌రెడ్డి నూతన వస్త్రాలను అందజేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సిబ్బందికి బట్టలు పంపిణీ చేసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. పంచాయతీ సిబ్బంది శివ, వెంకటేష్, నరసింహ, మస్తానయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణం

రాజంపేట, అక్టోబరు 11 : రాజంపేట మండలం చుండువారిపల్లెలో శుక్రవారం వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహించారు. . రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి సుగవాసి బాలబ్రసుమణ్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. అనంతరం సుగవాసిని గ్రామస్థులు ఘనంగా సత్కరించారు.

నేడు మంత్రి పర్యటన

రాయచోటిటౌన్, అక్టోబరు11: రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి శనివారం అన్నమయ్య జిల్లాలో పర్యటించనున్నారు. శనివారం ఉదయం 8 గంటలకు పట్టణంలోని వీరభద్రాలయాన్ని మంత్రి కుటుంబ సమేతంగా సందర్శించి స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించ నున్నారు. 9 గంటలకు రాయచోటి కిరాణా మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యం లో గాంధీ బజారులో ఏర్పాటు చేసిన వినియోగదారులసేవా కేంద్రంలో వంట నూనెల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 1 గంటకు రాయ చోటి నియోజకవర్గ పరిధిలోని సంబేపల్లె మండలం అడవికమ్మపల్లి గ్రామంలో ఉత్సవాల్లో అన్నదాన కార్యక్రమంలో పాల్గొంటారు.

చెరువు కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

గాలివీడు, అక్టోబరు11: చెరువును కబ్జా చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ అన్నమయ్య జిల్లా నాయకుడు మావులూరి విశ్వనాథ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎగువ గొట్టివీడు గ్రామం మావిళ్లపల్లె వద్ద ఆక్రమణకు గురైన సర్వే నెంబర్ 252లోని చెరువును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దాదాపు నాలుగు ఎకరాల చెరువు కబా చేసి, మూగ జీవాలకు మేత, తాగునీరు లేకుండా చేశారన్నారు. తక్షణమే కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమణ, రఘునాథ్, స్థానిక ప్రజలు పీ. పెద్దినాయుడు, పీ. చిన్నప్పనాయుడు పాల్గొన్నారు.

వంట నూనె ప్యాకెట్ల పంపిణీ కేంద్రం ప్రారంభం

రాయచోటిటౌన్, అక్టోబరు11: రాష్ట్రంలో అధిక ధరల కారణంగా ప్రజలు ఇబ్బంది పడుతుండడంతో రాష్ట్ర ప్రభుత్వం వంట నూనెలు సరసరమైన ధరలకు అందుబాటు లో ఉంచేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఇందులో భాగంగా వినియోగదారుల వ్యవహారాలు, పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో రాయచోటి పట్టణంలోని ఎస్‌జేబీ ట్రేడర్స్‌లో ఏర్పాటు చేసిన వినియోగదారుల సేవా కేంద్రాన్ని మంత్రి సోదరుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మిప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. అయిల్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల సేవా కేంద్రంలో ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు వంట నూనెలు అందుబాటులో ఉన్నాయని, వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

వీరబల్లి, అక్టోబరు11: మండల పరిధిలోని మట్లి పంచాయతీ గంగాపురంలో సర్పంచ్ నాగార్జునాచారి చొరవతో సమస్య పరిష్కారమైంది. గ్రామంలో ఉన్న స్కీం బోరు చెడిపోయిందని గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే ఆయన స్పందించి, మరమ్మతులు చేయించారు.

థియేటర్ వివాదం - కేసుల మయం

తలదూర్చిన రాజకీయం ● తలలు పట్టుకుంటున్న పోలీసులు ● గంగిరెడ్డిని విచారించిన వైనం
● ఎక్స్‌కవేటర్, హిటాచి సీజ్ ● పలువురిపై మూడు రకాల కేసులు నమోదు

రైల్వేకోడూరు, అక్టోబరు 11: పట్టణంలో ఒక సినిమా థియేటర్ వివాదంలో పోలీసులు ఇప్పటికే మూడు కేసులను నమోదు చేశారు. ఈ వివాదంలో రాజకీయ జోక్యం కలగడంతో పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. థియేటర్ స్థలం నాదంటే నాదని స్థానికులు పరస్పరం వాదులాడుకుంటున్నారు. స్థానిక రియల్ ఎస్టేటర్లు కొందరు ఈ వివాదంలో తలదూర్చడం విశేషం. ఈ వివాదంపైనే నెల కిందట ఎర్రస్మగ్లర్ గంగిరెడ్డిని సైతం పోలీసులు విచారిస్తే తనకు సంబంధం లేదని గంగిరెడ్డి పోలీసులకు వివరించారు. ఇందులో కేసులపై కేసులు నమోదు చేయడం గమనార్హం. తమకు హైకోర్టు ఆదేశాలున్నాయని మరికొందరు భారీయంత్రాలతో థియేటర్ గోడను కూల్చి వేసిందుకు ప్రధానంగా ముగ్గురు సహా మరికొందరిపై పోలీసులు గురువారం రాత్రి కేసు నమోదు చేశారు. ఇందులో పోలీసుల విధులకు ఆటంకం కల్గించినందుకు మరో కేసు నమోదు చేసి యంత్రాలను సీజ్ చేసినట్లు రైల్వేకోడూరు సీఐ హేమసుందర్‌రావు తెలిపారు. జిల్లాలోనే ఒక వెలుగు వెలిగిన సినిమా థియేటర్ వివాదం వివరాల్లోకెళితే...


ఇద్దరు సోదరులు ఎకరాస్థలాన్ని ఏళ్ల కిందట రూ.1లక్షకు కొనుగోలు చేశారు. సిమెంటు ధర బస్తా రూ.20 ఉన్న సమయంలో సినిమా థియేటర్‌ను నిర్మించారు. నిర్మాణ కార్మికులకు తక్కువ కూలీ ఉండడం, పెద్దగా కూలీలు లేకున్నా థియేటర్ నిర్మాణాన్ని త్వరగానే పూర్తి చేశారు. అప్పట్లో రిలీజ్ సినిమా వేస్తే థియేటర్ యజమానే స్వయంగా బటన్ ఆన్ చేస్తే సినిమా ప్రదర్శన ప్రాంభించేవారు. థియేటర్ ఆవరణలో ఆట విడుపు కోసం సోదరులు టెన్నిస్ కోర్టు కూడా ఏర్పాటు చేశారు. ఉమ్మడి కడప జిల్లాలో పోటాపోటీగా కొత్త సినిమాలను విడుదల చేస్తూ భారీగా ఆటలను ప్రదర్శించి సినిమా థియేటర్ ఒక వెలుగు వెలిగింది. ఇంత పేరున్న సినిమా థియేటర్ రానురాను కుంగిపోయి సినిమాలు ప్రదర్శించడం కష్టమైంది. ఒక్కసారిగా సినిమా థియేటర్ యజమానులు కుప్పకూలిపోయి థియేటర్‌ను లీజుకు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. తర్వాత థియేటర్‌ను అమ్మకానికి పెట్టడంతో పలువురి చేతులు మారింది. ప్రస్తుతం యజమానుల ఇంట్లోనే వివాదం తలెత్తింది. మొదటి యజమానులు అనారోగ్యంతో మృతి చెందారు. ఎదిగి వచ్చిన పిల్లలకు ఏమీ మిగలలేదు. థియేటర్‌ను అమ్మిన వారు కొన్న వారి మధ్య నేటికీ కోర్టులో వివాదం జరుగుతూనే ఉంది. ఇదిలా ఉండగా ఈ వివాదంలోకి కొత్త వారు ప్రవేశించడం, రాజకీయ జోక్యంతో వివాదం ముదిరిపాకా న పడింది. కాగా ఉమ్మడి కడప జిల్లా కు చెందిన ఒక రాజకీయ నేత సైతం తలదూర్చడంతో తారా స్థాయికి చేరింది. తమకు పవర్ ఆఫ్ పట్టా ఉందని జిల్లా స్థాయి రాజకీయ నాయకుడు ఇటీవల థియేటర్ పక్క నే ఉన్న గోడలను కూల్చి భూమి పూజ కూడా చేశా రు. విషయాన్ని చంద్ర అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యా దు చేయడంతో నలుగురిపై కేసు నమోదు చేయగా రైల్వేకోడూరు పోలీసులపై వత్తిడి పెరిగింది. తమకు హైకోర్టు ఆదేశాలున్నాయని మరికొందరు భారీ యంత్రాలతో థియేటర్ గోడను కూల్చినందుకు ప్రధానంగా ముగ్గురు సహా మరికొందరిపై గురువారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. అంతేకాకుండా పోలీసుల విధులకు ఆటంకం కల్గించినందుకు మరో కేసు నమోదు చేసి యంత్రాలను సీజ్ చేసినట్లు రైల్వేకోడూరు సీఐ హేమసుందర్‌రావు తెలిపారు. ఉమ్మడి కడప జిల్లాలోనే కాకుండా స్థానిక నేతలు కూడా సినిమా థియేటర్ వ్యవహారంలోకి ప్రవేశించి స్థానికులపై కేసులు పెట్టిస్తున్నారని ఆరోపణలున్నాయి. థియేటర్ మేము కొన్నామంటే మరో వర్గం మేము కొన్నామని వాదిస్తున్నారు. దీంతో అసలు విషయం అంతు చిక్కకుండా ఉండడం, అసలు యజమానులు ప్రత్యక్షంగా రాకపోవడం, కొసరు వాళ్లే రావడం కొసమెరుపు.



వివాదాస్పద సినిమా థియేటర్ ప్రహరీని కూల్చివేసిన దృశ్యం

సీఐ ఏమంటున్నారంటే

సినిమా థియేటర్ వివాదంలో శాంతిభద్రతలకు విఘాతం కల్గించకుండా చేస్తున్నామని, చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తున్నామని సీఐ హేమసుందర్‌రావు తెలిపారు. నెల కిందట కొందరు థియేటర్ స్థలంలో గోడలు పడగొట్టారని నలుగురిపై కేసు నమోదు చేశామని తెలిపారు. గురువారం థియేటర్ ప్రహరీని కూల్చివేయడంతో మళ్లీ ముగ్గురు మరి కొందరిపై కేసు నమోదు చేశామని తెలిపారు. గోడలు కూల్చిన యంత్రాలను సీజ్ చేశామని తెలిపారు. వివాదాస్పద థియేటర్ వద్ద పోలీసుల విధులకు ఆటంకం కల్గించినందుకు మరి కొందరిపై కేసు నమోదు చేశామని వివరించారు.



Counsel for the Petitioners : SRI JADA SRAVAN KUMAR
Counsel for the Respondents : GP FOR HOME

Petition under Section 151 CPC praying that in the circumstances stated in the affidavit filed in support of the writ petition, the High Court may be pleased to direct the respondent police not to call the petitioners to the police station duly interfere over the civil disputes except due procedure established by the law, pending disposal of WP No.22754 of 2024, on the file of the High Court.

The court while directing issue of notice to the Respondents herein to show cause as to why this application should not be complied with, made the following order. The receipt of this order will be deemed to be the receipt of notice in the case).

ORDER:

"Heard Sri Jada Sravan Kumar, learned counsel for Petitioners.

Learned Assistant Government Pleader takes notice for respondents.

Having heard learned counsel for Petitioners and considering the material on record, police are directed not to interfere in the civil disputes pending between the parties.

List the matter after Dasara vacation, 2024.

SD/- B.PRASAD RAU
ASSISTANT REGISTRAR
//TRUE COPY// SECTION OFFICER

To,
1. The Principal Secretary, State of Andhra Pradesh, Department of Home, AP Secretariat Buildings, at Amaravathi, Guntur District Andhra Pradesh. (by Special Messenger)
2. The District Superintendent of Police, ...

సివిల్ వ్యవహారంలో తలదూర్చవద్దని హైకోర్టు ఉత్తర్వులు

పోలీసుల అత్యుత్సాహం

సినిమా థియేటర్ వివాదంలో పోలీసులు అత్యుత్సాహం చూపిస్తున్నారంటూ థియేటర్ స్థలాన్ని కొనుగోలు చేశామని చెప్పుకుంటున్న వ్యక్తులు చెబుతున్నారు. సివిల్ వ్యవహారంలో పోలీసులు జోక్యం చేసుకూడదని హైకోర్టు నుంచి ఉత్తర్వులున్నా పోలీసులు జోక్యం ఎందుకు చూపిస్తున్నారని ఇటీవల కొనుగోలు చేసిన వారు ప్రశ్నిస్తున్నారు. సినిమా హాలు వివాదంపై జిల్లా స్థాయి అధికారి వత్తిడి ఉందని అందుకే పోలీసులు వరుస కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఫిర్యాది దారుడు ఊర్లో లేకున్నా వెంటనే సమాచారం తెలుసుకున్న పోలీసులు పరుగులు తీసి పనులను అడ్డుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. పోలీసులు సినిమాహాలు వివాదంలో తలదూర్చి ఉదయం నుంచి రాత్రి వరకు విచారణ పేరుతో కూర్చోబెట్టడం ఎంత వరకు సబబని వారు ప్రశ్నిస్తున్నారు. కొనుగోలు దారుడి దగ్గర అసలు డ్యాక్యుమెంట్లు ఉన్నాయని ఫిర్యాది దారుడు చెబుతున్నాడని పోలీసులు అంటున్నారు. కానీ అసలు సినిమా థియేటర్ యజమానులు ఎవరన్నది అంతుచిక్కని రహస్యంగా మారింది.



పోలీసులు సీజ్ చేసిన లారీ సహా హిటాచీ, ఎక్స్‌కవేటర్

ఫారెస్టు భూముల్లో ఇసుక రవాణాపై చర్యలు

12 ఎడ్ల బండ్లను పట్టుకున్న ఫారెస్టు అధికారులు

ప్రొద్దుటూరు అక్టోబరు 11: ప్రొద్దుటూరు పారెస్టు భూముల్లో ఇసుకను ఎడ్ల బండ్లలో అక్రమంగా రవాణా చేయడంపై ఫారెస్టు అధికారులు చర్యలకు దిగారు. శుక్రవారం ఫారెస్టు భూముల నుంచి ఇసుక రవాణా చేస్తున్న 12 ఎడ్లబండ్లను ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ హేమాంజలి, డీఆర్‌ఓ లక్ష్మీకుమారి పట్టుకున్నారు. ఎడ్లబండ్లయినా, ట్రాక్టర్లలో నైనా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. బండ్ల యజామానులకు రూ.30 వేలు జరిమానా విధించారు. మళ్లీపట్టుపడితే జరిమానా విధిస్తూ బండ్లు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

అత్తపై అల్లుడి దాడి - కేసు నమోదు

అట్లూరు, అక్టోబరు 11: కోనరాచపల్లె వాసి రమణారెడ్డి తన అత్త మాచుపల్లె రామసుబ్బమ్మపై బుధవారం రాత్రి రాళ్లతో దాడి చేశాడు. కారులో కూర్చుని ఉన్న అత్తపై దాడి చేసి కారు అద్దాలు పగలగొట్టి ఆమె తలకు తీవ్ర గాయాలు చేశాడు. ఎస్ఐ వివరాల మేరకు రామసుబ్బమ్మ అల్లుడు తన కూతురు సరళమ్మను రూ.2లక్షలు డబ్బు తీసుకురమ్మని వేధిస్తుండడంతో కూతురును ఇంటికి తీసుకెళ్లమని బుధవారం రాత్రి కోనరాచపల్లెకు వచ్చింది. దీంతో తన భార్యను పంపనంటూ అల్లుడు అత్తపై దాడి చేయడంతో రమణారెడ్డి, అతని తమ్ముడు రాజమోహన్‌రెడ్డి తండ్రి వెంకటసుబ్బారెడ్డిపై రామసుబ్బమ్మ ఫిర్యాదు మేరకు ఎస్ఐ రామక్రిష్ణ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పద్మావతి అమ్మవారికి బంగారు కన్నులు, వెండి కవచం సమర్పణ



పద్మావతిదేవి అమ్మవారికి బంగారు కళ్లు వెండికవచాన్ని సమర్పిస్తున్న చల్లా కుటుంబీకులు

చెన్నూరు, అక్టోబరు 11: ప్రసన్న వేంకటేశ్వరాలయంలో కొలువైన పద్మావతిదేవి (మహాలక్ష్మి)కి చల్లా సుబ్బారెడ్డి, యశోదమ్మ కుమారులు చల్లా శ్రీహరిరెడ్డి, ఆయన సతీమణి శ్రీలక్ష్మి, చల్లా చంద్రశేఖర్ రెడ్డి రాధిక కుటుంబీకులు 12.6 గ్రాములు బంగారు కన్నులు, రెండున్నర కిలోల వెండి కవచం సమర్పించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు వి.వీరారెడ్డి, పురోహితులకు శుక్రవారం ఆలయ ప్రాంగణలో వీటిని అందించారు. వీటిని ముఖ్యమైన పర్వదినాలు, గురు, శుక్రవారాల్లో అమ్మవారికి అలంకరించాలని ఆలయ కమిటీని చల్లా కుటుంబీకులు కోరారు. పవిత్రమైన దసరా ఉత్సవాల్లో మహర్నవమి రోజు అమ్మవారికి తాము సమర్పిస్తామని అనుకున్న విధంగా బంగారు కళు, వెండికవచం సమర్పించామన్నారు. ఆలయ కమిటీ దాతలకు ప్రసాదాలు, వస్త్రాలు సవర్పించారు.


సబ్‌జూనియర్స్ అంతర్ జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీలు

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 11: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రాపురంలో కృత్తివెంటి పేర్రాజుపంతులు క్రీడా ప్రాంగణలో నిర్వహిస్తున్న అంతర్ జిల్లాల సబ్‌జూనియర్స్ బాస్కెట్‌బాల్ పోటీలు ఉత్కంఠ భరితంగా జరుగుతున్నాయి. రెండో రోజు శుక్రవారం బాలికలు, బాలుర విభాగాల్లో వివిధ జిల్లాల జట్లు తలపడ్డాయి. బాలికల విభాగంలో చిత్తూరు, కడప జట్ల మధ్య జరిగిన పోటీలో చిత్తూరు, విశాఖపట్టణం, గుంటూరు మధ్య జరిగిన పోటీలో గుంటూరు, పశ్చిమగోదావరి, కడప జిల్లా జట్ల మధ్య జరిగిన పోరులో పశ్చిమగోదావరి, కృష్ణా, ప్రకాశం జట్ల మధ్య జరిగిన పోటీలో కృష్ణా, తూర్పుగోదావరి, చిత్తూరు జట్ల మధ్య జరిగిన పోరులో తూర్పుగోదావరి జట్టు విజయం సాధించాయి. బాలుర విభాగంలో గుంటూరు, కడప జట్లు తలపడగా గుంటూరు, చిత్తూరు, విశాఖపట్టణం జట్ల మధ్య జరిగిన పోటీలో విశాఖపట్టణం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లా జట్ల మధ్య జరిగిన పోరులో తూర్పుగోదావరి, అనంతపురం, కృష్ణా జట్ల మధ్య జరిగిన పోటీలో అనంతపురం, తూర్పుగోదావరి, గుంటూరు జట్ల మధ్య జరిగిన పోటీలో తూర్పుగోదావరి విజయం సాధించాయి. పోటీలను బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్ ఏపీ అధ్యక్షుడు చెంగల్రాయుడు, ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి తదితరులు పర్యవేక్షించారు.

కువైత్ నుంచి స్వగ్రామానికి నాగేంద్ర మృతదేహం

● ఎట్టకేలకు 40 రోజుల తర్వాత తరలింపు

సిద్దవటం... సికెదిన్నె, అక్టోబరు 11: కువైత్‌లో మృతి చెందిన కడప జిల్లా వాసి నాగేంద్ర మృతదేహాన్ని ఇండియాకు తరలించేందుకు అక్కడి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బుగ్గపల్లె పంచాయతీ బుగ్గలేటి వాసి ఉప్పు నాగేంద్ర జీవనోపాధి కోసం కువైత్‌కు వెళ్లి భార్యాబిడ్డలను పోషించుకుంటున్నాడు. దాదాపు నెల రోజుల కిం దట అనుమానాస్పద స్థితిలో నాగేంద్ర మృతి చెందాడు. అయితే అతని మృతదేహాన్ని పంపించేందుకు అక్కడి నిబంధనల ప్రకారం అన్నీ పూర్తి చేసిన తర్వాతే మృతదేహాన్ని పంపిస్తామని సేఠ్ తెలపడంతో తరలింపు ప్రక్రియ నిలిచిపోయింది. చిట్టచివరకు ఊపిరి ఆడక చనిపోయినట్లు అక్కడి ప్రభుత్వం నిర్ధారించడంతో మృతదేహాన్ని తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.



నాగేంద్ర ఫైల్ ఫొటో

● నేడు కడపకు రాక

మృతిచెందిన నాగేంద్ర మృతదేహం శనివారం కడపకు చేరుతుందని వారి బంధువులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలున్నారు. వారి జీవనానికి ప్రభుత్వం సహకరించాలని కుటుంబీకులు కోరుతున్నారు. మృతదేహం తరలింపులో కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి, కడప కలెక్టర్, ఎస్పీల సహకారం ఉందని కుటుంబీకులు తెలిపారు.

రైల్వే సమస్యలపై ఎంపీ సీఎం రమేష్‌కు వినతి

రాజంపేట టౌన్, అక్టోబరు 11: రాజంపేట పార్లమెంట్ పరిధిలోని రైల్వే సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రైల్వేబోర్డు ప్లానింగ్ కమిటీ చైర్మన్, ఎంపీ సీఎం రమేష్‌కు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు వినతిపత్రం సమర్పించారు. రాజంపేట, నందలూరు, కోడూరు తదితర ప్రాంతాల్లో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగడంలేదని, దూర ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పార్లమెంటరీ కేంద్రమైన రాజంపేటలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగకపోవడం దారుణమన్నారు. వెంటనే రైల్వే ప్లానింగ్ కమిటీ చైర్మన్‌గా ఈ సమస్యలను పరిష్కరించాలని సీఎం రమేష్‌కు విన్నవించారు.



ఎంపీ సీఎం రమేష్‌కు వినతి పత్రం ఇస్తున్న నాగోతు రమేష్ నాయుడు


కడప- బెంగళూరు రైల్వేలైన్ పూర్తి చేయాలి

ముఖ్యమంత్రి చంద్రబాబుకు లీగల్ సర్వీసెస్ అథారిటీ కమిటీ మాజీ సభ్యుడు బహిరంగ లేఖ

రాయచోటిటౌన్, అక్టోబరు 11: కడప-రాయచోటి-మదనపల్లె-బెంగళూరు నూతన బ్రాడ్ గేజ్ రైల్వేలైన్ పనులను వెంటనే పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాయచోటి మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ కమిటీ మాజీ సభ్యుడు యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి బహిరంగ లేఖ రాశారు. బెంగుళూరు రైలు మార్గంపై విడుదల చేసిన బహిరంగ లేఖ సారాంశంలోకెళితే.... రాయలసీమ రైతులు, వినియోగదారులు, అన్ని వర్గాల ప్రజల సమగ్రాభివృద్ధి కోసం 2008-09 రైల్వేబడ్జెట్‌లో కడప- రాయచోటి- మదనపల్లె- బెంగళూరు బ్రాడ్‌గేజ్ రైలు మార్గం మంజూరైంది. 255.40 కిలోమీటర్ల రైలు మార్గంలో 205 కిలోమీటర్లు దూరం కర్నాటక రాష్ట్రంలో ఉంది. ఈ ప్రాజెక్టుకు 50 శాతం నిధులు కేంద్రం, 50 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించే షరతులతో మంజూరైంది. ఈ క్రమంలో 2008-09 అంచనాల మేరకు ప్రాజెక్టు వ్యయం రూ.3038 కోట్లతో 2010 సెప్టెంబరులో అప్పటి రైల్వే మంత్రి మునియప్ప శంకుస్థాపన చేశారు. నాలుగు దశల్లో ప్రాజెక్టు పని పూర్తి చేయాలని నిబంధనలున్నాయి. మొదటి దశలో కడప నుంచి పెండ్లిమర్రి వరకు, రెండో దశలో పెండ్లిమర్రి నుంచి లక్కిరెడ్డిపల్లె వరకు, మూడో దశలో రాయచోటి నుంచి వాల్మీకిపురం-వాయల్పాడు- మదనపల్లె సరిహద్దు ముల్‌బాగల్ వరకు, నాల్గవ దశలో కర్నాటకలోని ముల్‌బాగల్ నుంచి కోలార్ వరకు నిర్మాణం పూర్తి అయ్యేలా రూపొందించారు. ఇందులో కడప నుంచి పెండ్లిమర్రి వరకు 21.80 కిలోమీటర్ల దూరం పని పూర్తి అయ్యింది. ఇప్పటి వరకు ఆ రైల్వే ప్రాజెక్టు కోసం కేవలం రూ.351 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. వైసీపీ ప్రభుత్వం డబ్బు చెల్లించకపోగా ఈ రైల్వేలైన్ వద్దని, దానికి బదులు ముద్దనూరు-పులివెందుల, ముదిగుబ్బ నూతన రైల్వే లైన్ మంజూరు చేయమని 2021 జూలై 17న కేంద్రానికి లేఖ రాసింది. కడప-బెంగుళూరు రైల్వేలైన్‌పై వైసీపీ ప్రభుత్వం ప్రగతి నిరోధక చర్య చేపడుతూ, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశయానికి గండికొట్టింది. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో కొత్త రైల్వే ప్రాజెక్టును మంజూరు చేయమని కోరకుండా ఇప్పటికే మంజూరైన రూ.351 కోట్లు ఖర్చు చేసి 21.80 కిలోమీటర్లు పూర్తి చేసిన కడప-పెండ్లిమర్రి -లక్కిరెడ్డిపల్లె- రాయచోటి, మదనపల్లె- బెంగళూరు రైల్వే ప్రాజెక్టును వద్దని లేఖ రాయడం చారిత్రక తప్పిదమని ఆయన లేఖలో ప్రస్తావించారు.

యువకుడి ఆత్మహత్య

రైల్వేకోడూరు(రూరల్) అక్టోబరు 11: అనంతరాజుపేట పంచాయతీ వడ్డిపల్లిలో ఆవులకుంట సురేంద్ర(21) ఉరివేసుకుని మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మృతుడు తల్లి కుటుంబ కలహాలతో ఇంటి నుంచి వెళ్లిపోవడంతో మనస్థాపం చెంది గురువారం రాత్రి ఉరివేసుకుని మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు తండ్రి కువైట్‌లో ఉన్నాడు. ఈ మేరకు మృతుడు తాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



బషీరున్నీసా మృతి

కడప (సెవెన్‌రోడ్స్), అక్టోబరు 11: సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు, ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర నాయకురాలు సి.బషీరున్నీసా శుక్రవారం సాయంత్రం మృతి చెందారు. బషీరున్నీసా ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలిగా, ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా, జాతీయ సమితి సభ్యురాలుగా, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలిగా, రాష్ట్ర సమితి సభ్యులుగా పీడిత వర్గం కోసం, పేదల అభ్యున్నతి కోసం కృషి చేశారు. ఆమె మృతి పట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామక్రిష్ణ, రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు ఓబులేసు, జి.ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి గాలిచంద్ర తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమె కుటుంబానికి సంతాపం ప్రకటించారు.



సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

పోరుమామిళ్ల, అక్టోబరు 11: వ్యక్తిగత కారణాలతో శంఖవరం రమేశ్ (30) విష రసాయనం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ కొండారెడ్డి కథనం మేరకు వివరాలిలా.. రంగసముద్రం పంచాయతీ శ్రీరామ్‌నగర్‌కాలనీ వాసి రమేశ్ గురువారం రాత్రి ఇంటి ముందు విషరసాయనం తాగి మృతి చెందాడన్నారు. మృతుని తండ్రి శ్రీరాములు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహానికి శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించారు కుమారుడి మరణం తెలిసిన వెంటనే శ్రీరాములు కుప్పకూలిపోయాడు.

వైజాగ్‌లో సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి

చిట్వేలి, అక్టోబరు 11: విశాఖపట్టణంలో సుప్రీంకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేయాలని జిల్లా రైతుసంఘం నేత మలిశెట్టి జతిన్ విజ్ఞప్తి చేశారు. విశాఖపట్టణం రైల్వేజోన్ ఏర్పాటు కాబోతోంది, బెంగుళూరు హైదరాబాదు, అమరావతి, చెన్నై నగరాలకు బుల్లెట్ ట్రైన్ అనుసంధానించాలన్న ఆలోచనలో ప్రభుత్వాలు ఉన్నాయన్నారు. రైల్వే సౌకర్యంతో దక్షిణభారతదేశ రాష్ట్రాలు, తూర్పు ప్రాంతమైన ఒరిస్సా, చత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర ప్రాంతాలకు కూడా విశాఖపట్టణం అందుబాటులో ఉంటుందన్నారు. అందులోను విశాఖపట్టణంలో అత్యాధునిక భవనాలు నిర్మించారని, వాటిని సుప్రీంకోర్టు బెంచ్‌కు ఉపయోగించుకోవచ్చని, ఇది ప్రజలకు ఉపయోగమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచించి బెంచ్‌ను ఏర్పాటు చేయించాలని ఓ ప్రకటన కోరారు.

అవుకు నుంచి గండికోటకు కృష్ణాజలాలు నిలుపుదల

కొండాపురం,అక్టోబరు 11: అవుకు రిజర్వాయిర్ నుంచి జీఎన్ఎస్ఎస్ కాల్వ ద్వారా గండికోట ప్రాజెక్టుకు వచ్చే కృష్ణాజలాలు బంద్ అయినట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. దీంతో గండికోటకు ఇన్‌ఫ్లో లేకపోవడంతో మైలవరం జలాశయానికి కూడా నీటిని నిలుపుదల చేసినట్లు డీఈ తెలిపారు. సీబీఆర్‌కు 1000 క్యూసెక్కులు, వామికొండ, సర్వరాయసాగర్‌కు 100 క్యూసెక్కుల చొప్పున గండికోట ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేస్తున్నారు. కాగా ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 26.4 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ఆత్మహత్య కేసులో భర్త, అత్తకు రిమాండ్

చక్రాయపేట, అక్టోబరు 11: ఆత్మహత్యకు పాల్పడిన యువతి కేసులో భర్త ప్రశాంత్, అత్త నాగలక్ష్మికి కోర్టు రిమాండ్ విధించినట్లు ఆర్కేవ్యాలీ సీఐ భాస్కర్ రెడ్డి తెలిపారు. అద్దాలమర్రి వాసి తోళ్లపల్లె గంగా సుమతి ఈనెల 7న ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. ఈ ఘటనలో కేసు నమోదు చేసిన పోలీసులు గంగాసుమతి భర్త ప్రశాంత్, అతని తల్లి నాగలక్ష్మిని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. వీరిని సత్యసాయి జిల్లా తలుపుల బస్టాప్ వద్ద శుక్రవారం మధ్యాహ్నం అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

యువతి అదృశ్యం

అట్లూరు, అక్టోబరు 11: కామసముద్రం ఎస్టీకాలనీకి చెందిన కాసల చంద్రప్రియ కనిపించకుండా పోయిందని అట్లూరు పోలీసుస్టేషన్ కేసు నమోదైంది. తల్లి జయమ్మ ఫిర్యాదు చేసిన వివరాల్లోకెళితే... కాసల నాగరాజు - జయమ్మ కుమార్తె కాసల చంద్రప్రియ గురువారం రాత్రి 11గంటలకు కనిపించకుండా పోయిందని తెలిపారు.

వినికిడి యంత్రాల పంపిణీ

రాజంపేట, అక్టోబరు 11 : కేంద్ర ప్రభుత్వం మినిస్ట్రీ ఫర్ సోషల్ జస్టిస్ ద్వారా దివ్యాంగులకు పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్ తెలిపారు. వినికిడి లోపం ఉన్న వారికి అలింకో సంస్థ ద్వారా అరుంధతి వాడలో గంపాల సుబ్బయ్య, నాగిపోగు సుబ్బమ్మ, సుబ్బరాయుడుకు వినికిడి పరికరాలను అందజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ సంస్థ ద్వారా పరికరాలను పొందవచ్చన్నారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షురాలు ప్రభావతమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణయాదవ్, మైనార్టీ మోర్చా మోర్చా అధ్యక్షురాలు సునీత నారాయణవర్మ, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాపికలు అందజేత

చిన్నమండెం, అక్టోబరు11: అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శారద, పవనకుమారి అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ద్వారా జ్ఞాపిక అందుకున్నారు. బేటీ బచావో, బేటీ పడావోలో శ్రీరామ్‌నగర్, దిగువ గొట్టివీడు గ్రామాల్లో బాల్య వివాహాలను ఆపడంలో వీరు కీలక భూమిక పోషించడంతో ఈ పురస్కారం దక్కింది. ఐసీడీఎస్ పీడీ రమాదేవి, డీఎంహెచ్‌ఓ కొండయ్య, డీఈఓ శివప్రకాశ్‌రెడ్డి, సీడీపీఓలు సూపర్‌వైజర్లు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.



మదనపల్లె ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో రూ.13కోట్ల ఆదాయం

● 22 దుకాణాలకు 650 దరఖాస్తులు

మదనపల్లె టౌన్, అక్టోబరు 11: మదనపల్లె ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వానికి రూ.13కోట్ల ఆదాయం వచ్చింది. శుక్రవారం సాయంత్రం ఏడు గంటల వరకు మదనపల్లె ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 22 ప్రైవేటు మద్యం దుకాణాలకు గాను 650 దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో దరఖాస్తు రుసుం రూ.2లక్షలు పెట్టుకుంటే మొత్తం 650 దుకాణాలకు గాను ప్రభుత్వానికి రూ.13 కోట్ల ఆదాయం వచ్చింది. ఇందులో మదనపల్లె మున్సిపాలిటీలోని 10 దుకాణాలకు 281 దరఖాస్తులు, రూరల్‌లోని 4 దుకాణాలకు 114, బి.కొత్తకోట నగర పంచాయతీలో 2 దుకాణాలకు 84, బి.కొత్తకోట రూరల్‌లోని ఒక దుకాణానికి 26, నిమ్మనపల్లె మండలంలోని ఒక దుకాణానికి 36, రామసముద్రం మండలంలోని ఒక దుకాణానికి 36, కురబలకోట మండలంలోని 3 దుకాణాలకు 72 దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ సీఐ భీమలింగ తెలిపారు.

తపాలా సేవలను సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న ఎస్ఎస్‌పీ నరసప్ప

పీలేరు, అక్టోబరు 11: తపాలా శాఖ ద్వారా లభిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తపా లా శాఖ తిరుపతి ఎస్ఎస్‌పీ ఎన్.నరసప్ప విజ్ఞప్తి చేశారు. తపాలా వారోత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం ఆయన పీలేరులోని తపాలా కార్యాలయా న్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ వారోత్సవాల్లో భాగంగా పీలేరు డివిజన్‌లో 4660 సేవింగ్స్ ఖాతాలు ప్రారంభించాలన్న లక్ష్యంలో 4000 ఖాతాలు ప్రారంభించామన్నారు. దీంతో పీలేరు పోస్టాఫీసు పరిధిలో 97,627 సేవింగ్స్ ఖాతాలు ఉన్నాయన్నారు. తమ శాఖ ఆధ్వర్యంలో తిరుపతి డివిజన్‌లోని తిరుపతి, చంద్రగిరిలలో రెండు ఏటీఎంలు పనిచేస్తున్నాయన్నారు. ప్రమాద బీమాను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం తపాలా శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న వివిధ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్, పోస్టుమాస్టర్ మల్లిఖార్జున తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి


రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న స్వచ్ఛంద సంస్థల సభ్యులు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 11: మానవ అక్రమ రవాణాను అరిక ట్టాలని మదనపల్లె పట్టణంలో ప్ర జా సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు డిమాండ్ చేశారు. గ్రామజ్యోతి సొసైటీ ఆధ్వర్యం లో శుక్రవారం వెలుగు ప్రత్యేక స్కూ ల్‌లో రౌండ్ టెబుల్ సమావేశం నిర్వహించారు. ముందుగా మానవ అక్రమ రవాణాకు గురైన వారి కొర కు, హత్యలకు బలైనవారి కోసం పూలతో నివాళులర్పిం చి క్యాండిల్స్ వెలిగించి మౌనం పాటించారు. నేటి సమాజంలో జరుగుతున్న సంఘటనలపై అందరూ అవగాహన పెంచు కోవాలని పేర్కొన్నారు. ప్రేమ, పెళ్లి, ఉద్యోగం, ఉపాధి, సినిమా అవకాశాల పేరుతో అక్రమ రవాణా అధికంగా ఉందని, అరికట్టే దిశగా చర్యలు చేపట్టడంతోపాటు అవగాహన కల్పించాల న్నారు. మహిళలను బలవంతపు వ్యభిచారంలోకి దించే ముఠాల పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామజ్యోతి సొసైటీ సుభద్ర, వెలుగు ఉదయ మోహన్‌రెడి, భాగ్యలక్ష్మి సంస్థ మునిరత్నం, మలమహానాడు అధ్యక్షుడు యమల సుదర్శనం, సీపీఎం శ్రీనివాసులు, సీనియర్ సిటిజన్స్ మునిగోపాల్ కృష్ణ, పియర్స్ సంస్థ వేమనారాయణ, రీడో సంస్థ ఈశ్వరయ్య, పీపుల్ రూరల్ డెవలప్ మెంట్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు బొజ్జప్ప, ఫోర్డు సంస్థ లలితమ్మ, చైతన్య సేవాసంస్థ కవితారాణి, హెల్పింగ్ మైండ్స్ సంస్థ అబూబక్కర్ పాల్గొన్నారు.









గుండెపోటుతో ఆర్టీసీ డ్రైవరు మృతి


ఆర్టీసీ డ్రైవరు అంకయ్య

కలికిరి, అక్టోబరు 11: పట్టణంలోని అమర నాథ రెడ్డి నగర్‌కు చెందిన ఆర్టీసీ డ్రైవరు అంకన్న (58) గుండె పోటుతో మృతి చెందా డు. రాయచోటి డిపోలో డ్రైవరుగా పని చేస్తున్న అంకన్న గత కొంత కాలంగా అనా రోగ్యంతో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో తిరుపతి రూయా ఆసుపత్రిలో చికిత్సలో వుండగా గురువారం రాత్రి గుండె పోటుకు గురై మరణించాడు. శక్రవారం కలికిరిలో జరిగిన అంత్యక్రియల కు టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు హాజరై నివాళు లర్పించారు.



నేడు కలికిరికి మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రాక

కలికిరి, అక్టోబరు 11: ఉమ్మడి ఏపీ మాజీ సీఎం, బీజేపీ నా యకుడు నల్లారి కిరణ్‌కుమా ర్ రెడ్డి శనివారం కలికిరి రానున్నారని ఆయన వ్యక్తిగ త కార్యదర్శి కృష్ణప్ప తెలి పారు. హైద రాబాదు నుంచి సాయంత్రం 5.15 గంటలకు తిరుపతికి విమానంలో రాను న్నారు. అక్కడి నుంచి రాత్రి 7.25కు కలికిరి చేరుకుంటా రు. ఆదివారం నుంచి ఇక్కడే బస చేసి స్థానికంగా ఏర్పాట య్యే కార్యక్రమాల్లో పాల్గొం టారని కృష్ణప్ప వివరించారు.





రేపు ఉత్తమ ప్రతిభ కనపర్చిన కురుబ విద్యార్థులకు ఆత్మీయ సన్మానం

మదనపల్లె అర్బన్, అక్టోబరు11: మదనపల్లె డివిజన్‌లో ఉత్తమ ప్రతిభ కనపర్చిన కురుబ కులస్థుల విద్యార్థులకు ఆదివారం ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కురబ సంఘ సామాజిక సేవా సొసైటీ మదనపల్లె డివిజన్ కార్యదర్శి మర్రిపాటి రమేష్ తెలిపారు. ఈ నెల 13న (ఆదివారం) మదనపల్లె పట్టణంలో ఉదయం 10 గంటలకు ఉత్తమ ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు ప్రోత్సాక బహుమతులు సన్మానం ఉంటుందన్నారు.















వాల్మీకి జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి



మదనపల్లె ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న వాల్మీకిమహాసేన నాయకులు

మదనపల్లె అర్బన్, అక్టోబరు11: వాల్మీకి జయంతిని సెలవు దినంగా ప్రకటించాలని వాల్మీకి మహాసేన నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ దేశంలో కొన్ని చోట్ల వాల్మీకులను ఎస్టీలుగానూ, మరికొన్ని చోట్ల బీసీలుగానూ వ్యత్యాసాలు చూపడం దారుణమన్నారు. దీంతో వాల్మీకులకు అందాల్సిన రిజర్వేషన్ ఫలాలు అందడంలేదని చెప్పారు. ఈ నెల 17న వాల్మీకి జయంతిని రాష్ట్రవ్యాప్తంగా పండుగలా జరపాలన్న ప్రభుత్వ నిర్ణయం పట్ల తాము ఆనందం వ్యక్త చేస్తున్నట్లు చెప్పారు. వాల్మీకి జయంతిని సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో వాల్మీకి మహాసేన రాష్ట్ర నాయకుడు విజయ్‌కుమార్, జిల్లా నాయకుడు ముత్తరాశి హరికృష్ణ, నాయకులు రవి, శ్రీనమునుస్వామి, బంవగారు శంకర, బొగ్గిటి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను చదివించాలి



పడమటి దళితవాడలో బాలికల చదువుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పెద్దమండ్యం, అక్టోబరు 11: ఆడపిల్లలను ప్రతి తల్లిదండ్రులు తప్పకుండా చదివించాలని తంబళ్లపల్లి ఫోర్డు సంస్థ డైరెక్టర్ లలితమ్మ పేర్కొన్నారు. పెద్దమండ్యం మండలంలో శుక్రవారం ఆ సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. మండలంలోని రామానాయక్ తండా, మండ్యం మాదిగిపల్లి, పడమటి హరిజనవాడ, బండ్రేవు గ్రామాలలో బాలికల దినోత్సవం సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లల చదువు కుటుంబానికి, సమాజానికి శ్రేయస్కరమన్నారు. వారిలో చైతన్యం తీసుకురావాలన్నారు. మండల ఫోర్డు సంస్థ కోఆర్డినేటర్ నరసింహులు సిబ్బంది రెడ్డమ్మ, అనిత, రమణ, భువనేశ్వరి, శైలజ, అంగన్‌వాడీ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

14 నుంచి పట్టాభిరాముడి పవిత్రోత్సవాలు

వాల్మీకిపురం, అక్టోబరు 11: వాల్మీకిపురం పట్టణంలో వెలసిన పట్టాభిరామాలయం లో పట్టాభిరాముడు పవిత్రోత్సవాలు టీటీడీ ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజులు పేర్కొన్నారు. రాముడికి ఎంతో ప్రీతిపాత్రమైన ఈ ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈనెల 14న సాయంత్రం పవిత్రోత్సవాలకు అంకురార్పణ, 15న ఉదయం యాగశాల వైదిక కైంకర్యములు, పవిత్ర ప్రతిష్ఠ, స్నపనతిరుమంజనం, జరుగనున్నాయి. 16న ఉదయం పవిత్రాల సమర్పణ, సాయంత్రం వైదిక కైంకర్యాలు, 17న ఉదయం ఆలయంలో సుప్రభాత సేవ సాయంత్రం సీతారాముల తిరుచ్చి తిరువీధి ఉత్సవం ఉంటుందన్నారు.

భయపెట్టడం వల్లే రమేష్ ఆత్మహత్య చేసుకొన్నాడు

- బాధితుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు

నిమ్మనపల్లి, అక్టోబరు 11: మండలంలోని రాచవేటివారిపల్లి పంచాయతి గొల్లపల్లికి చెందిన బీదం రమేష్(23)ను ప్రత్యర్థులు భయపెట్టడం వల్లే అవమానం భరిచలేక విషంతాగి ఆత్మహత్య చేసుకొన్నాడని తండ్రి సుధాకర్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ రమేష్ తెలిపారు. గొల్లపల్లికి చెందిన భూదేవి కుమార్తె రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయిందని ఇందుకు కారణం రమేష్ అంటూ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి భయపెట్టమే కాకుండా బుధవారం రాత్రి రమేష్ ఇంటి వద్ద ఉండగా భూదేవి, నాగభూషణం ఇద్దరు దుర్భాషలాడి కొట్టారన్నారు. దీంతో అవమానంతో తన కుమారడు రమేష్ ఇంటిలో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడని గమనించి మదనపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో తిరుపతికి తరలించారన్నారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు తెలిపారు. సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

వాల్మీకిపురం, అక్టోబరు 11: రోడ్డు ప్రమాదంలో రెడ్డిఖాన్(72) అనే వృద్ధుడు మృతి చెందాడు. స్థానిక కొత్త ఇందిరమ్మ కాలనీకి చెందిన రెడ్డిఖాన్ తోపుడు బండిపై పండ్ల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం రాత్రి వ్యాపారం ముగించుకుని ఇంటికి వెళ్తుండగా ఇందిరమ్మ కాలనీ సమీపంలో ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో రెడ్డిఖాన్ తీవ్రంగా గాయపడగా హుటాహుటిన స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మదనపల్లెకి తిరిగి తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. స్థానిక ఎస్ఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం స్వాధీనం

రామసముద్రం, అక్టోబరు 11: మండల సరిహద్దులోని కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యం స్వాధీనం చేసుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు మదనపల్లె ప్రొహిబిషన్ ప్రత్యేక బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ రంగస్వామి తెలిపారు. మండలంలోని మినికి గ్రామానికి చెందిన తోటి గిరిబాబు తన ఇంటి లో కర్ణాటక మద్యం ఒరిజినల్ ఛాయిస్ 72ప్యాకెట్‌లు అమ్ముతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడి చేసి మద్యం స్వాధీనం చేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు రంగస్వామి తెలిపారు.

నేడు విజయదశమి

మదనపల్లెటౌన్, అక్టోబరు11: విజయదశమి పండుగ వేడుకలను శనివారం జరుపుకోనున్నారు. ఇందు కోసం ఆలయాలలో భక్తుల కోసం నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.



బదులు బహిరంగ ప్రకటన

10-10-2024వ తేదీన ఈనాడు దినపత్రిక నందు మార్పూరి శ్రీనివాసులు గారి కుమారుడు అయిన మార్పూరి శ్రీరాం గారి తరపున శ్రీ డి మురళీక్రిష్ణ న్యాయవాది ద్వారా యిచ్చిన బహిరంగ ప్రకటనకు నా కక్షి కర్త అయిన అన్నమయ్య జిల్లా, మదనపల్లి మండలం, మదనపల్లి పోస్టు మరియు టౌను బండమీదకమ్మపల్లి గ్రామం నీరుగట్టువారిపల్లి రామిరెడ్డి లే అవుట్ మార్కెట్ యార్డు సమీపములో డోరు నెం. 3-146-3-డి-9 రులో కాపురం వుండు కోనేటి వెంకటరమణ గారి కుమార్తె కోనేటి సులోచన తరపున యివ్వబడిన బదులు బహిరంగ ప్రకటన ఏమనగా!

షెడ్యూలు దాఖలా ఆస్తి మార్పూరి క్రిష్ణమూర్తిగారికి చెంది, అతని పేరు రెవెన్యూ వారు ఖాతా నెం.127 రు నమోదు కాబడి అతని అనంతరం అతని కుమారుడైన మార్పూరి వెంకటేశులునకు హక్కు కలిగి 03-02-2023వ తేదీన సదరు మార్పూరి వెంకటేశులు రూ.2,78,71,000/-లు అక్షరాలా రెండు కోట్ల డెభై ఎనిమిది లక్షల డెభై ఒక్క వేలు రూపాయలు నా కక్షి కర్త నుండి తీసుకొని, షెడ్యూలు దాఖలా ఆస్తి మరియు ఇతర ఆస్తులు నా కక్షి కర్త పేరిట పులివెందల సబ్ రిజిష్టారి వారి ఆఫీసు నందు విక్రయ దస్తావేజు డాక్యుమెంటు నెం. 725/2023 రుగా రిజిష్టరు చేయించి, షెడ్యూలు దాఖలా ఆస్తి మరియు ఇతర ఆస్తులు నా కక్షి కర్తకు స్వాధీన పరచి యున్నాడు. నా కక్షి కర్త షెడ్యూలు దాఖలా ఆస్తి నందు ఆర్.సి.సి. మోల్డింగు మిద్దె మరియు రేకుల షెడ్డు వేసుకొని నా కక్షి కర్త యొక్క హక్కు అనుభవములో వున్నది. 10-10-2024వ తేదీన మార్పూరి శ్రీరాం గారి యిచ్చిన ప్రకటన యందు విషయములు మరియు షెడ్యూలు దాఖలా ఆస్తి గురించి తప్పుడు విషయములతో ప్రకటన యిచ్చియున్నారు. మార్పూరి శ్రీరాం మరియు అతని తండ్రి మార్పూరి శ్రీనివాసులు గారికి బండమీదకమ్మపల్లి గ్రామం దాఖలా సర్వేనెం. 36 రు నందు ఎలాంటి హక్కు అనుభవము లేదు. షెడ్యూలు దాఖలా ఆస్తికి సంబంధించి ఇంటి పన్నులు, కరెంటు బిల్లులు నా కక్షి కర్త అయిన కోనేటి సులోచన చెల్లించుచున్నది. మరియు నా కక్షి కర్త పేరు మునిసిపల్ రికార్డుల యందు నమోదు కాబడినది. షెడ్యూలు దాఖలా ఆస్తి నందు నా కక్షి కర్త అయిన కోనేటి సులోచనకు తప్ప ఇతరులకుఏలాంటి హక్కు అనుభవము లేదు. అని యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూలు : అన్నమయ్య జిల్లా, మదనపల్లి సబ్.డి., మదనపల్లి మండలం మదనపల్లి మునిసిపల్ ఏరియా బండమీదకమ్మపల్లి రెవెన్యూ గ్రామం వార్డు నెం.3, నీరుగట్టువారిపల్లి వద్ద గల సర్వేనెం.36/1 రు పైకి డోరు నెం.3-146-3-డి-9 రు, ఆర్.సి.సి. మోల్డింగు మిద్దె మరియు బిడువు జాగాకు చెక్కుబంది వివరము. తూర్పు : మద్దెమ్మ ఇల్లు, పడమర : తారు రోడ్డు (మదనపల్లి - కదిరి రోడ్డు), ఉత్తరము : మార్కెట్ యార్డు కాంపౌండు గోడ. దక్షిణము : మద్దిరెడ్డిగారి జాగా మరియు నాగమణి ఇల్లు. ఈ హద్దుల మధ్యలో గల తూర్పు పడమర ఉత్తర దిశన 199 అడుగులు లేక 60.655 మీటర్లు. తూర్పు పడమర దక్షిణ దిశన 192 అడుగులు లేక 58.521 మీటర్లు. ఉత్తర దక్షిణం తూర్పు దిశన 70 అడుగులు లేక 21.336 మీటర్లు. ఉత్తర దక్షిణం పడమర దిశన 123 అడుగులు లేక 37.490 మీటర్లు. ఈ కొలతలు గల 2096.19 చదరపు గజములు జాగా, ఇందులో నిర్మించి వుండు 2520 చదరపు అడుగుల ఆర్.సి.సి. మోల్డింగు మిద్దె మరియు 1200 చదరపు అడుగులు గల రేకులతో కప్పబడిన రూములు పూరా. ఇందులకు అమర్చిన తలుపులు, ద్వారబందనములు, కిటికీలు, కరెంటు పరికరములు, కరెంటు మీటరు నెం. 5211300071347, 5211300071371, 5211300071288, 5211300071287, మరియు 5211300063087 వగైరా సహా పూరా.

కంచి మంజునాథ రెడ్డి, B.Com, B.L,
అడ్వకేట్, మదనపల్లి.






మంగంపేట సమస్యలపై సీపీవోకు వినతి

ఓబులవారిపల్లె, అక్టోబరు 11 : సమస్యలను తీర్చాలంటూ మంగం పల్లి కార్మిక సంఘాల నాయకులు సీహెచ్ చంద్రశేఖర్, ఆర్.వెంకటేశ్ సీపీవో గోపీనాథ్‌కు వినతిపత్రం అం దజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగం పేట పరిధిలోని అయ్యపు రెడ్డిపల్లెలో 2012లో నిర్వాసి తులైన వారికి నేటికీ ఇంటి స్థలాలు ఇవ్వలేదన్నారు. ఈ విషయం ఏపీఎండీసీ యాజ మాన్యం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చేస్తామని సీపీవో తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.


రాజరాజేశ్వరిగా కన్యకామాత



రాజరాజేశ్వరిగా వాసవీమాత కురబలకోట


మహిషాసురమర్దినిగా రెడ్డెమ్మ తల్లి, గుర్రంకొండ


ధనలక్ష్మిగా చౌడేశ్వరీదేవి మదనపల్లె


తంబళ్లపల్లెలో మహిషాసురమర్దిని


మహిషాసురమర్దినిగా కలికిరి ఎల్లమ్మ


పీటీఎంలో దర్శనం ఇస్తున్న పార్వతీ అమ్మవారు


వెండి కవచ అలంకరణలో నరసింహుడు, మదనపల్లె

మదనపల్లె అర్బన్, అక్టోబరు11:దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగం గా శుక్రవారం అమ్మవారు రాజరాజేశ్వరిదేవిగా భక్తులను కటాక్షించారు. ముఖ్యంగా అమ్మవారికి ప్రీతిపాత్రమైన శుక్రవారం కావడంతో పట్టణం లోని వాసవీభవన్ వీధిలోని కన్యకాపరమేశ్వరీ అమ్మవారిని రాజరాజే శ్వరిదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య సంఘం మదనపల్లె అధ్యక్షుడు ఒంప్రకాష్ ఆధ్వర్యంలో వైభవంగా చండీహోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో ఆర్యవైశ్య మహిళలు పాల్గొని కోలాటం, చెక్కభజనలు నిర్వహించారు. పిల్లలతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కోర్టులో వెలసిన గంగమ్మను వివిధ రకాల పుష్పాలతో శోభయమానంగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం కావడంతో మహిళలు పూలు, పండ్లు, చీర, జాకెట్లు, పసుపు, కుంకుమలతో ఆలయానికి తరలివచ్చి అమ్మవారికి సమర్పించారు. అనపగుట్ట, శ్రీవారినగర్‌లో అభయలక్ష్మీ నరసింహస్వామికి వెండి కవచం అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. దేవతా నగర్‌లోని రాజరాజేశ్వరీ ఆలయంలో అమ్మవారు మహిషాసురమర్దినిగా భక్తులకు అభయమిచ్చారు. నీరుగట్టువారిపల్లెలోని చౌడేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారిని ఆలయకమిటీ సభ్యులు వంద, 200, 500 రూపాయల నోట్లతో ధనలక్ష్మీ అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. మహిళలకు పసుపు, కుంకుమ, గాజులు పంపిణీ చేశారు.

నిమ్మనపల్లిలో: దసరా శరన్నవరాత్రులు సందర్భంగా నిమ్మనపల్లి పంచాయతి పెద్దమాదిగపల్లి వెలసిన మాతమ్మతల్లి ధనలక్ష్మిదేవి అలంకరణలో దర్శనమించ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని కరెన్సీ నోట్లతో ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే ఆలయాని వచ్చిన భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు.

కురబలకోటలో: దసరాశరన్నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా కన్యకా పరమేశ్వరీ అమ్మవారు రాజరాజేశ్వరిదేవీ అలంకరణలో శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

వాల్మీకిపురంలో: వాల్మీకిపురం మండల వ్యాప్తంగా శుక్రవారం దసరా శరన్నవరాత్రి వేడుకలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మండలంలోని గండబోయనపల్లె సత్యమ్మతల్లి ఆలయంలో, వాల్మీకిపురం కోనేటివీధిలోని కన్యకాపరమేశ్వరి ఆలయం, స్థానిక నల్లవీరగంగాభవానీ ఆలయం, గొల్లపల్లె విరూపాక్షమ్మ తల్లి ఆలయాలలో మహిషాసురమర్దిని అలంకరణలు గావించి విశేష పూజలు చేశారు. చింతపర్తి వాసవీ అమ్మవారి ఆలయంలో ధనలక్ష్మిదేవి అలంకరణలతో పూజలు నిర్వహించారు.

తంబళ్లపల్లెలో: తంబళ్లపల్లె మండల కేంద్రంలోని శివాలయంలో కొలువు దీరిన పార్వతీ దేవి అమ్మవారు మహిషాసురమర్దిని రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. దసరా నవరాత్రి ఉత్సవాలల్లో బాగంగా శుక్రవారం ఆలయ చైర్మన్ ఎం.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గుర్రంకొండలో:గుర్రంకొండ మండలం చెర్లోపల్లె రెడ్డెమ్మ అమ్మవారు శుక్రవారం మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మ వారి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని దర్శించుకోవడా నికి వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. . అలాగే గుర్రంకొండ కొత్తపేటలో కొలువైన పోలేరమ్మ ఆలయంలో అమ్మవారు కూడా మహిషాసురమర్దినిగా భక్తులను కనువిందు చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

కలకడలో:మండలంలోని కోనలో కొలువైన చౌడేశ్వరి దేవి శుక్రవారం మహిషాసురమర్దినిగా భక్తులను కటాక్షించారు. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల పుష్పాలు, పండ్లతో అలంకరించారు. అలాగే కలకడ సిద్దేశ్వర ఆలయంలో కామాక్షి అమ్మవారిని దుర్గాదేవిగా అలం కరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ప్రజలు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొన్ని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

పీలేరులో: శరన్నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా శుక్రవారం పీలేరు గ్రామ దేవత రౌద్రాల అంకాళమ్మ మహిషాసుర మర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చింది. నెహ్రూబజారులోని కన్యకా పరమేశ్వరి అమ్మవారు మీనాక్షి దేవిగా, మోడల్ కాలనీ వద్దనున్న ఎల్లమ్మ, ఇంది రమ్మ కాలనీ వద్దనున్న దిన్నె గంగమ్మలు దుర్గా దేవి అలంకారాల్లో దర్శనమిచ్చారు. నవమితోపాటు శుక్రవారం కావడంతో అమ్మవార్లను మహిళలు పెద్దఎత్తున దర్శించుకున్నారు. ఆయా ఆలయాల నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ములకలచెరువులో: స్థానిక పీటీఎం రోడ్డులో వెలసినవాసవీ కన్యకా పరమేశ్వరిదేవి అమ్మవారు శుక్రవారం అశ్వరుడావాహన అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పెద్దతిప్పసముద్రంలో: మండల కేంద్రమైన పీటీఎంలో వెలసిన ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో దసరా ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పార్వతీ అమ్మవారిని డ్రైఫ్రూట్స్‌పూలు, పత్రిలతో విశేషంగా అలంకరించారు. శుక్రవారం నవమి కావడంతో ఆలయానికి భక్తులు పోటెత్తారు. పీటీఎంతో పాటు సమీప గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

కలికిరిలో: స్థానిక గ్రామ దేవత ఎల్లమ్మ శుక్రవారం మహిషాసుర మర్దని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అదే విధంగా వాసవీ మాత ఆలయంలో కొలువైన కన్యకాపరమేశ్వరి అర్ధనారీశ్వరి అలంకారంలో భక్తులకు కనువిందు చేశారు.దసరా ఉత్సవాల సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

ఆకాశాన్నంటిన కూరగాయల ధరలు

మదనపల్లె అర్బన్, అక్టోబరు11: కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. సామాన్యుడికి కూరగాయల ధరలు ధడ పుటిస్తున్నాయి. మధ్యతరగతి కుటుంబాలు కూరగాయలు కొనేదిఎలా తినేదిఎలా అని వాపోతున్నారు. ప్రస్తుతం నిత్యవస రాల సరుకులుతోపాటు కూరగాయలు ధరలు వినియోగధారుడికి ఆర్థికంగా పెనుభారంగా మారింది. మార్కెట్‌కు వెళ్లి కూరగాయలు కిలో కొనాలని వెళ్లినవారు పావు కిలో కొనుగోలు చేసి దాంతోనే పూటగడుపుతున్నారు. ఎన్నడూ లేనివిధంగా మదనపల్లె దినసరి మార్కెట్‌లో కూరగాయల ధరలు మండిపోతున్నాయి. పంట దిగుబడులు తగ్గడంతో వినియోగదారులపై ఆర్థికంగా భారం పడుతుంది. కూరగాయలు ధరలు ఎప్పుడు తగ్గుముఖం పడుతాయాన్ని ఎదురుచూసే పరిస్థితి నెలకొంది. మదనపల్లె పరిసర ప్రాంతాల్లో రైతులు ఎక్కువ గా ఉండడం, వారు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. ఈ క్రమంలో వరి, వెరుశనగతోపాటు కూరగాయలు కూడా సాగు చేస్తున్నారు. కాగా ఈ ప్రాంతంలో గత కొనేళ్లుగా వాణిజ్య పంటలపై మొగ్గుచూ పడంతో సాంప్రదాయ పంటసాగు ఘననీయంగా తగ్గిపోయింది. వర్షాలు సకాలంలో కురవక నీటి ఆధారిత పంటలు ఉన్న కొద్ది ఎక్కరాల్లో రైతులు సాగు చేస్తున్నారు. తమకున్న పొలం పూర్తిగా సాగులేకి తీసుకురాలేకపోతున్నారు. దీనికి ముఖ్య కారణం, వర్షంతోపాటు, వ్యవసాయం చేయడానికి ఖర్చులు అధికంగా పేరగడం.

వారపు సంతకు తప్పని కష్టాలు

మదనపల్లె పట్టణంలోని వారసపుసంతలో కూరగాయల రోజువారి మార్కెట్‌కు తరలించి వ్యాపారం సాగుతుంది. రోజు మూడు వందల టన్నులు మాత్రమే అమ్మకాలకు వస్తున్నాయి. స్థానికంగా రైతులు పండించే టమోటా, వంగ, బీర, కాకర, బీన్స్ తోపాటు కర్ణాటక రాష్ట్రంలో రైతుల నుంచి క్యారెట్, ముల్లంగా, బీట్‌రూట్, మునగ, అనంతపురం నుంచి కాకర,గుమ్మడి, చిక్కుడు, అలసంద, వాటిని వ్యాపారులు అక్కడికి దిగుమతి చేసుకొంటున్నారు. ఇప్పుడు సగానికి తక్కువగా కూరగాయలు మార్కెట్‌కు తగ్గడంతో ఇక్కట్లు తప్పడంలేదంటూ రైతులు చెబుతున్నారు. దీంతో దసరా పండగకు ప్రస్తుతం మదనపల్లె మార్కెట్‌కు 100 మెట్రిక్ టన్నులు మాత్రమే వస్తున్నాయి. ప్రస్తుతం టమోటా రూ90, క్యారెట్ రూ.160. తెల్లగడ్డలు రూ.600 ఎర్రగడ్డలు రూ.60, కాకర రూ.160, బీన్స్‌రూ.400, బెంగకాయలు రూ.120 పలుకుతున్నాయి.

మదనపల్లెలో ఆకట్టుకున్న దసరా బొమ్మల కొలువు


బొమ్మల కొలువు ఏర్పాటు చేసిన మహిళలు

మదనపల్లె అర్బన్, అక్టోబరు11: విజయదశమి సందర్భంగా మదనపల్లె పట్టణం ఈస్ట్‌కొత్తపేటలోని ఓ ఇంటిలో శుక్రవారం ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు అందరిని ఆకట్టుకుంది. మహిళలు సురేఖా, జ్యోతి, శివకుమారి, హర్షిత, శాంతిలు కలిసి వివిద రకాల మూడు వందలకు పైగా బొమ్మలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది దసరాకు బొమ్మలు కొలువు ఏర్పాటు చేయడం ఆనవాయితీగా చేసుకున్నట్లు చెప్పారు. ఇలా చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణం

రాజంపేట, అక్టోబరు 11 : రాజంపేట మండలం చుండువారిపల్లెలో శుక్రవారం వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహించారు. .రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. అనంతరం సుగవాసిని గ్రామస్థులు ఘనంగా సత్కరించారు.

అమ్మవారిశాలలో సుగవాసి పూజలు

రాజంపేట, అక్టోబరు 11 : పట్టణంలోని అమ్మవారి శాలలో కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో శుక్రవారం రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం పూజలు నిర్వహించారు. వేద పండితులు అమ్మవారి తీర్థ ప్రసా దాలను అందజేసి వేదమం త్రాలతో ఆశీర్వదించారు. అనంతరం దుశ్శాలువాతో సత్కరించారు. అనంతరం ఆర్యవైశ్య నాయకులను కలిసి సుగవాసి చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, దసరా ఉత్సవ కమిటీ సభ్యులు, టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

పారిశుధ్య సిబ్బందికి దుస్తులు పంపిణీ

చిట్వేలి, అక్టోబరు 11 : దసరా పండుగను పురస్కరించుకుని చిట్వేలి గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు ఉపసర్పంచ్ ఉమామహే శ్వర్‌రెడ్డి నూతన వస్త్రాలను అందజేశారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సిబ్బందికి దుస్తులు పంపిణీ చేసి దసరా శుభాకాంక్షలు తెలిపారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

గాలివీడు, అక్టోబరు11: బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని అతేనా, ప్రేరణ సంస్థ రీజనల్ కోఆర్డినేటర్ సర్వలత తెలిపారు. వారు శుక్రవారం మండలంలోని తూముకుంట పంచాయతీలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం వివిధ అంశాల్లో క్రీడలను నిర్వహించి వారందరికీ బహుమతులను అంద జేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ మమత పాల్గొన్నారు.

కడప- బెంగళూరు రైల్వేలైన్ పూర్తి చేయాలి

ముఖ్యమంత్రి చంద్రబాబుకు లీగల్ సర్వీసెస్ అథారిటీ కమిటీ మాజీ సభ్యుడు బహిరంగ లేఖ

రాయచోటిటౌన్, అక్టోబరు 11: కడప-రాయచోటి-మదనపల్లె-బెంగుళూరు నూతన బ్రాడ్ గేజ్ రైల్వేలైన్ పనులను వెంటనే పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాయచోటి మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ కమిటీ మాజీ సభ్యుడు యర్రపురెడ్డి విశ్వనాధరెడ్డి బహిరంగ లేఖ రాశారు. బెంగుళూరు రైలు మార్గంపై విడుదల చేసిన బహిరంగ లేఖ సారాంశంలోకెళితే.... రాయలసీమ రైతులు, వినియోగదారులు, అన్ని వర్గాల ప్రజల సమగ్రాభివృద్ధి కోసం 2008-09 రైల్వేబడ్జెట్‌లో కడప- రాయచోటి- మదనపల్లె- బెంగుళూరు బ్రాడ్‌గేజ్ రైలు మార్గం మంజూరైంది. 255.40 కిలోమీటర్ల రైలు మార్గంలో 205 కిలోమీటర్లు దూరం కర్నాటక రాష్ట్రంలో ఉంది. ఈ ప్రాజెక్టుకు 50 శాతం నిధులు కేంద్రం, 50 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించే షరతులతో మంజూరైంది. ఈ క్రమంలో 2008-09 అంచనాల మేరకు ప్రాజెక్టు వ్యయం రూ.3038 కోట్లతో 2010 సెప్టెంబరులో అప్పటి రైల్వే మంత్రి మునియప్ప శంకుస్థాపన చేశారు. నాలుగు దశల్లో ప్రాజెక్టు పని పూర్తి చేయాలని నిబంధనలున్నాయి. మొదటి దశలో కడప నుంచి పెండ్లిమర్రి వరకు, రెండో దశలో పెండ్లిమర్రి నుంచి లక్కిరెడ్డిపల్లె వరకు, మూడో దశలో రాయచోటి నుంచి వాల్మీకిపురం-వాయల్పాడు- మదనపల్లె సరిహద్దు ముల్‌బాగల్ వరకు, నాల్గవ దశలో కర్ణాటకలోని ముల్‌బాగల్ నుంచి కోలార్ వరకు నిర్మాణం పూర్తి అయ్యేలా రూపొందించారు. ఇందులో కడప నుంచి పెండ్లిమర్రి వరకు 21.80 కిలోమీటర్ల దూరం పని పూర్తి అయ్యింది. ఇప్పటి వరకు ఆ రైల్వే ప్రాజెక్టు కోసం కేవలం రూ.351 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. వైసీపీ ప్రభుత్వం డబ్బు చెల్లించకపోగా ఈ రైల్వేలైన్ వద్దని, దానికి బదులు ముద్దనూరు-పులివెందుల, ముదిగుబ్బ నూతన రైల్వే లైన్ మంజూరు చేయమని 2021 జూలై 17న కేంద్రానికి లేఖ రాసింది. కడప-బెంగుళూరు రైల్వేలైన్‌పై వైసీపీ ప్రభుత్వం ప్రగతి నిరోధక చర్య చేపడుతూ, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశయానికి గండికొట్టింది. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో కొత్త రైల్వే ప్రాజెక్టును మంజూరు చేయమని కోరకుండా ఇప్పటికే మంజూరైన రూ.351 కోట్లు ఖర్చు చేసి 21.80 కిలోమీటర్లు పూర్తి చేసిన కడప-పెండ్లిమర్రి -లక్కిరెడ్డిపల్లె- రాయచోటి, మదనపల్లె- బెంగుళూరు రైల్వే ప్రాజెక్టును వద్దని లేఖ రాయడం చారిత్రక తప్పిదమని ఆయన లేఖలో ప్రస్తావించారు.

14 నుంచి 'పల్లె పండుగ'

రైల్వేకోడూరు, అక్టోబరు 11: ఈ నెల 14 నుంచి 20 వరకు పల్లె పండుగ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రైల్వేకోడూరు మండల అభివృద్ధి అధికారి నాగార్జునరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 14న రైల్వేకోడూరు, ఓబనపల్లె, 15న వెంకటరెడ్డి ఎల్లె, వీపీఆర్ కండ్రిక, 16న రాఘవరాజపురం, చియ్యవరం, 17న అనంతరాజుపేట, 18న బొజ్జావారిపల్లె, 19న మైసూరివారిపల్లె, 20న మాధవరంపోడు గ్రామ పంచాయతీలలో పల్లెపండుగ జరుగుతుందని ఆయన వివరించారు.

టీచర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లండి

రాయచోటిటౌన్, అక్టోబరు 11: అన్నమయ్య జిల్లాలోని వివిధ మండ లాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు సంబంధించిన వివిధ సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏపీ జేఏసీ జనరల్ సెక్రటరీ కేఎస్ఎస్ ప్రసాద్‌కు యూటీఎఫ్ అన్నమ య్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యర్శులు హరిప్రసాద్, జాబీర్ వినతి ఎత్రం అందజేశారు. కడపజిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం కడప జిల్లా కార్యలయానికి విచ్చేసిన ఏపీ జేఏసీ సెక్రటరీ జనరల్ కేఎస్ఎస్ ప్రసాద్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ జీవో నెంబర్ 51 ప్రకారం డీఏ అరియర్స్ బిల్లులను సీఎఫ్ఎంఎస్‌లో తయారీకి మరల అవకాశం కల్పించే విధంగా రాష్ట్ర ఆర్థికశాఖ, ఖజానాఖాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లా లని కోరారు. అలాగే 2023-24 సంవత్సరాల్లో పదవ తరగతి పరీక్షలు నిర్వహించిన జవాబు పత్రాల మూల్యాంకనం చేసిన వారికి రెమ్యున రేషన్ జిల్లా విద్యాశాఖ అధికారులు నేటికీ చెల్లించలేదని వినతి పత్రంలో పేర్కొన్నారు. సమస్యలను విద్యాశాఖ కమిషనర్ దృష్టికి తీసుకె ళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ అన్నమయ్య జిల్లా కార్యదర్శి వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

యువతలో క్రీడా స్ఫూర్తి ఉండాలి

ఓబులవారిపల్లె, అక్టోబరు 11 : మండల పరిధిలోని మంగం పేట గ్రామ పంచాయతీ పరిధిలో మంగంపేట యూత్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీ బాల్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే అరవ శ్రీధర్, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలు మానసిక స్థిరత్వాన్ని పెంపొందించడానికి దోహదం చేస్తాయని అన్నారు.ఈ పోటీల్లో 26 జట్లు పోటీ పడుతున్నాయి. టీటీపీ సీనియర్ నాయకులు కల్లా చలపతి, యువ నాయకులు ముక్కా సాయివికాస్‌రెడ్డి, విశాల్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, లావులూ రు చరణ్, మంగంపేట సర్పంచ్ సుధాకర్, గ్రామ యూత్, ప్రజలు, ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి